
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

శనివారం 7 జూన్ 2025



బచ్చన్నపేట మండలం కట్కూరులో...

ఆయిల్‌పామ్ సాగుతో స్థిరాదాయం

- భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే భూ భారతి
- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



బచ్చన్నపేటలో ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్

బచ్చన్నపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌పామ్ పంట సాగు చేసి స్థిరాదాయం పొందవచ్చని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బచ్చన్నపేట మండల కేంద్రంలో ఇందిర అనే మహిళా రైతు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంటను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు నష్టాలు వచ్చే అవకాశం ఉండదన్నారు. జిల్లాలో 2వేల మంది రైతులు 7వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 3,500 ఎకరాలు లక్ష్యంగా చేసుకుని ఇప్పటి వరకు 45మంది రైతులకు సంబంధించి 1,716 ఎకరాలు గుర్తించటం జరిగిందన్నారు. కోతుల బెడద, వడగళ్ల వాన నష్టం ఉండదన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ఆయిల్‌పామ్ రైతులతో మాట్లాడారు. రైతులకు అవగాహన కల్పించి లక్ష్యంకు మించి పంట సాగయ్యేలా చూడాలని ఉద్యానవన శాఖాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి రవికాంత్, ఫీల్డ్ ఆఫీసర్ శశి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఉపయోగపడుతుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండలంలోని కొన్నె గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరై పరిశీలించారు. రైతులు ఏ సమస్యలతో సదస్సుకు హాజరవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే హెల్ప్‌డెస్క్‌ల్లో రైతులు అందిస్తున్న వివరాలు, ఫార్మాట్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఫణికిశోర్, ఎంఆర్ఐ వంశీకృష్ణ, ఆర్ఐ ఎండీ.మున్వర్ తదితరులు పాల్గొన్నారు.





పాలకుర్తి మండలకేంద్రంలోని రేషన్ దుకాణం వద్ద క్యూ

రేషన్!

- మూడు నెలల బియ్యం పంపిణీలో చిక్కులు
- తరచూ మొరాయిస్తున్న ఈ-పాస్ సర్వర్
- ఒక కార్డుదారుడు ఆరు సార్లు వేలిముద్రలు వేయాల్సిందే..
- ఒక్కరికి 15 నిమిషాలకు పైగా సమయం
- జిల్లాలో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారుల పడిగాపులు

జనగామ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీలో చిక్కులు ఏర్పడుతున్నాయి. ఒకేసారి మూడు నెలల కోటా ఇవ్వడంతో రేషన్ డీలర్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల కోటా కోసం వేర్వేరుగా వేలిముద్రలు తీసుకోవాల్సి రావడం, సర్వర్ మొరాయించడం వంటి కారణాలతో అటు డీలర్లకు, ఇటు లబ్ధిదారులకు చికాకు తెప్పిస్తోంది. ఒక్కో కార్డుదారుడికి 15 నిమిషాలకు పైగా సమయం పడుతుండడంతో లబ్ధిదారులు గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. దీంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులు బారులుతీరి ఉంటున్నారు.

ఆరు సార్లు వేలిముద్రలు

మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీలో భాగంగా ఒక్కో కార్డుదారుడు ఆరు సార్లు వేలిముద్ర వేయాల్సి వస్తోంది. రేషన్ బియ్యం పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, కేంద్ర ప్రభుత్వం వాటా కూడా ఉంటుంది. ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యం ఇస్తుండగా ఇందులో కేంద్రం వాటా 5 కిలోలు కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా ఒక కిలో ఉంటుంది. ఇంతకుముందు వరకు రేషన్ ఇచ్చే సమయంలో డీలర్లు ఒకేసారి వేలిముద్ర తీసుకునేవారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జూన్, జూలై, ఆగస్టు నెల బియ్యాన్ని ఒకేసారి ఇస్తోంది. దీంతో ఒక్కో నెలకు రెండు సార్లు చొప్పున మూడు నెలలకు గాను ఆరు సార్లు వేలిముద్రలు తీసుకుంటున్నారు.

మొరాయిస్తున్న సర్వర్

రేషన్ బియ్యం పంపిణీలో భాగంగా ఈ-పాస్ సర్వర్‌తో చిక్కులు ఏర్పడుతున్నాయి. మూడు నెలల కోటా ఒకేసారి ఇవ్వడంతో పాటు ఒక్కో కార్డుదారుడికి ఆరు సార్లు వేలిముద్రలు తీసుకోవడంతో సర్వర్‌పై ఒత్తిడి పడుతోంది. దీంతో సర్వర్ స్లోగా పనిచేస్తోందని డీలర్లు చెబుతున్నారు. సర్వర్ స్లోగా ఉండడంతో పంపిణీ ప్రక్రియలో ఆలస్యం అవుతోంది. మే నెల వరకు ఒకేసారి వేలిముద్ర తీసుకునే విధానం ఉండగా ప్రస్తుతం ఆ విధానం మారింది. మూడు నెలలకు ఒకేసారి బియ్యం ఇవ్వాలని నిర్ణయించిన క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఈ-పాస్ యంత్రా ల్లో సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం మార్చింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల కోటాకు వేర్వేరుగా వేలిముద్రలు తీసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను మార్పు చేసింది. ఈ సాఫ్ట్‌వేర్ డీలర్లకు కూడా కొత్త కావడంతో పంపిణీలో ఆలస్యం అవుతోంది.

లబ్ధిదారుల పడిగాపులు

బియ్యం పంపిణీలో ఆలస్యం అవుతుండడంతో దుకాణాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. జిల్లాలో ఎక్కువగా కూలీ పనులకు, ఇతరత్రా పనులకు వెళ్లేవారే ఎక్కువగా ఉన్నారు. దీంతో వారు పనికి వెళ్లడానికి ముందే ఉదయం వేళలో రేషన్ దుకాణాలకు వస్తున్నారు. ఇలా ఒకేసారి రావడంతో దుకాణాల వద్ద రద్దీ ఏర్పడుతోంది. కొందరు సాయంత్రం వేళల్లో వెళుతుండగా ఎక్కువగా ఉదయం పూటనే బియ్యం తీసుకునేందుకు వెళ్తున్నారు. జనం ఒక్కసారిగా రావడంతో ఇబ్బంది ఏర్పడుతోందని పలువురు డీలర్లు చెబుతున్నారు.

నిలిచిన ఈ-పాస్ సర్వర్

రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించిన ఈ-పాస్ సర్వర్ శుక్రవారం సాయంత్రం రెండు గంటల పాటు పూర్తిగా నిలిచిపోయింది. దీనిపై డీలర్లు అధికారులకు సమాచారం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వర్ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. పంపిణీ ప్రక్రియను సులభతరం చేసేందుకు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసేందుకు నిలిపివేశారా? సాంకేతిక కారణాలతో నిలిచిపోయిందా.. అన్నదానిపై స్పష్టత లేదు.

పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు కృషి

- దేవాలయ నిర్మాణం చాలా పవిత్రమైనది
- పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



సింగరాజుపల్లిలో బడిబాటలో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ప్రభుత్వ బడుల ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నదని తెలిపారు. శుక్రవారం మండలంలోని సింగరాజుపల్లిలో నిర్వహించిన బడిబాట ర్యాలీకి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్న అనంతరం గ్రామంలో శివాలయం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు. ప్రైవేటు బడుల్లో అత్యధిక ఫీజులు ఖర్చు చేసి నష్టపోవద్దని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధనతో పాటు ఉన్నత విద్యను అభ్యసించిన ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు.

సింగరాజుపల్లిలో గ్రామస్థుల ఆహ్వానం మేరకు శివాలయం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. గ్రామాల్లో శాంతి, ఐక్యత, అభివృద్ధి కోసం దేవాలయాలు కేంద్ర బిందువుగా నిలుస్తాయన్నారు. భవిష్యత్‌లో ఆలయం ఆధ్యాత్మిక కేంద్రమవుతుందని అభిప్రాయపడ్డారు. ఇళ్లు లేని పేద వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లు కట్టిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఇళ్లు లేని పేదవారికి సొంతింటి కల సాకారమవుతుందన్నారు. ప్రతి లబ్ధిదారుడు తన ఇంటిని సురక్షితంగా, భవిష్యత్‌ను బలపర్చుకునే విధంగా నిర్మించుకోవాలని సూచించారు. అదేవిధంగా సీతారాంపురం మాజీ సర్పంచ్ రెడ్డిరాజుల రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనతో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పంపిణీ చేయించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు పులిగిళ్ల వెంకన్న, తోటకూరి పాండు కృష్ణ, కొంగరి ఉమేష్, ఓడపెల్లి రవి, దావెర అనిల్‌కుమార్, దొపాటి రవి, జక్కుల గంగరాజు, నర్సయ్య, యాదగిరి, రాజేందర్, మల్లారెడ్డి, ఎంఈవో కళావతి, హెడ్మాస్టర్లు సుచిత్రానంద్, అంబటి అంజయ్య, బాస్కుల అంజయ్య, ఉపాధ్యాయులు చైతన్య, మాధవి, ప్రావీన, శ్రీదేవి, శారద, ఎల్లయ్య, సనీత, అంగన్‌వాడీ టీచర్లు మంగ, రేణుక, శ్రీలత, ఏపీపీ చైర్మన్లు నోముల పద్మ, జోగు అనిత, సీఏ మహేశ్వరి, స్వామి పాల్గొన్నారు.

పంట రుణాలు మంజూరు చేయాలి

- బ్యాంకుల ఎదుట సీపీఎం నేతల ధర్నా



జనగామ ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నేతలు

జనగామ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పంట రుణాలను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందూనాయక్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో జనగామ జిల్లాకేంద్రంలోని మునిసిపల్, నెహ్రూ పార్కు ఎస్‌బీఐ బ్యాంకుల ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల డిపాజిట్లతో నడుస్తున్న బ్యాంకులు రైతులకు 22 శాతం దీర్ఘకాలిక, 18 శాతం పంట రుణాలు ఇవ్వాలని ఆర్‌బీఐ చట్టం చెబుతున్నా బ్యాంకులు మాత్రం ఇవ్వడం లేదన్నారు. రుణాలు ఇవ్వకపోవడం వల్ల రైతులు అప్పులు తెచ్చి ఆత్మహత్యల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వాల హామీ ప్రకారం రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు మీట్యానాయక్, బోడ రాములు, కుమార్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డల్లాస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సక్సెస్

- మాజీ మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : డల్లాస్‌లో ఎన్ఆర్ఐల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను సక్సెస్ చేసినందుకు ప్రజాప్రతినిధులకు మాజీ మంత్రి దయాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయన అక్కడి నుంచి మాట్లాడుతూ చేనేత మిత్ర, నేతన్నకు చేయూత అనే అద్భుతమైన పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశామని తెలిపారు. వరంగల్, సిరిసిల్లలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేసి ఎందరో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిందని అన్నారు. కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కు మంజూరి చేశామన్నారు. తెలంగాణ రాగానే కేసీఆర్ ప్రభుత్వం నాడు సిద్దిపేట గొల్లభామ చీరలు, గద్వాల చీరలు, పోచంపల్లి ఇక్కత్ లాంటి వస్త్రాలను రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్లోకి పంపించిందని తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్సీ రమణ, ఎన్ఆర్ఐ ప్రతినిధులు ఉన్నారు.



డల్లాస్‌లో దయాకర్‌రావు, ఎమ్మెల్సీ రమణలను సన్మానిస్తున్న ఎన్ఆర్ఐలు

ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్య వైఖరి తగదు

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జయప్రకాశ్

జఫర్‌గఢ్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై కమిటీల పేరుతో కాలయాపన ధోరణి విడనాడి.. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కమిటీ దృష్టికి తెచ్చిన ఆర్థికేతర డిమాండ్లను కూడా ప్రభుత్వం పరిష్కరించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో కనీసం మూడింటినైనా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై సర్కార్ సాచివేత ధోరణిని అవలంబిస్తే ఐక్య పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. విద్యాశాఖ జారీ చేసిన 1267 జీవో ద్వారా ఉపాధ్యాయుల సర్దుబాటు చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యార్థుల నమోదు పూర్తయిన తరువాతే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేయాలని, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్లు, ఎంఈవో పోస్టులకు విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, ప్రతీ ఏటా ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదర్శ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని టీచర్లకు పదోన్నతులు కల్పించాలని, గురుకుల, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని జయప్రకాశ్ సర్కార్‌ను కోరారు.

జీలుగ విత్తనాల తరలింపుపై కొనసాగుతున్న విచారణ

- వ్యవసాయ శాఖ అధికారుల పాత్రపై ఆరా..
- మరోమారు తొర్రూరు పోలీసుల విచారణ

బచ్చన్నపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జీలుగ విత్తనాలను ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మిన ఆగ్రోస్ డీలర్ వ్యవహారంపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ, పోలీసు ఉన్నతాధికారులు విడివిడిగా మూడు రోజులుగా విచారణ సాగిస్తున్నారు. ఆగ్రోస్ డీలర్ శ్రీనివాస్ రెడ్డి నమోదు చేసిన రైతుల పేర్ల ఆధారంగా విచారణ సాగుతుండగా, జీలుగ విత్తనాల విషయమే తమకు తెలియదని అనేక మంది రైతులు విచారణ అధికారుల ముందు వెల్లడిస్తున్నారు. వాస్తవానికి జీలుగ విత్తనాల పర్మిట్లను ఆయా గ్రామాల క్లస్టర్‌లలో పనిచేస్తున్న ఏఈవోలు రాసి, వారి లాగిన్‌లలో పర్మిట్ ప్రొసీడింగ్‌లు ఇచ్చి విత్తనాలు అందించాలి. విచారణలో అలా జరగలేదని తెలిసింది. కేవలం వ్యవసాయాధికారి లాగిన్ నుంచే పర్మిట్ ప్రొసీడింగ్‌లు రిలీజ్ అయినట్టు అధికారులు గుర్తించినట్టు సమాచారం. జీలుగ విత్తనాలు పక్కదారి పట్టడం వెనుక వ్యవసాయాధికారుల పాత్ర ఏ మేరకు ఉందనే విషయమై విచారణాధికారులు లోతుగా పరిశీలిస్తున్నారు. ఒకవేళ డీలరు పాత్ర ప్రధానమైతే ప్రతిరోజు పర్మిట్ల వివరాలు పరిశీలించనందుకు వ్యవసాయాధికారుల మెడకు చుట్టుకునే అవకాశం ఉందంటున్నారు. కా గా, శుక్రవారం తొర్రూరు పోలీసులు మరోమారు బచ్చన్నపేట రైతు వేదికలో విచారణ జరిపారు. అంతే కాకుండా గత ఐదు సంవత్సరాలుగా ఆగ్రోస్‌కు వచ్చిన జీలుగ విత్తనాలకు సంబంధించిన వివరాలతో పాటు, రైతుల వివరాలు తీసుకుని విచారణ జరపాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఏదేమైనా ఈ జీలుగ విత్తనాల అక్రమ అమ్మకం ఎక్కడికి దారితీస్తుందోననే ఆందోళన సంబంధిత శాఖ అధికారుల్లో నెలకొంది.



బచ్చన్నపేట రైతు వేదికలో ఏఈవోల నుంచి వివరాలు తీసుకుంటున్న పోలీసులు

భక్తుల కొంగుబంగారం లక్ష్మీనర్సింహస్వామి

- రేపటి నుంచి స్వామి వారి జయంతి ఉత్సవాలు
- 11న వైభవంగా శ్రీలక్ష్మీనారసింహుల కల్యాణం



ఆలయం ఎదుట సహజసిద్ధంగా ఏర్పడిన దేవుని గుండం (కోనేరు)



కొండపై రాతిని చీల్చుకుని సతీసమేతంగా వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి

జఫర్‌గడ్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కొండపై రాయిని చీల్చుకుని వెలిసిన శ్రీవేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి.. కోరిన కోర్కెలు నెరవేర్చే భక్తజనుల ఇలవేల్పుగా కీర్తించబడుతున్నాడు. జఫర్‌గడ్‌లోని సుమారు 1,600 మీటర్ల ఎత్తున గల పడమర కొండ (దేవుని గుట్ట)పై సతీ సమేతంగా లక్ష్మీనర్సింహస్వామి కొలువు దీరాడు. కొండపై అగస్త్య మహర్షి తపస్సు ఫలితంగా నర్సింహస్వామి సుమారు ఆరు శతాబ్దాల క్రితం ఈ ఎత్తైన కొండపై శిలను చీల్చుకుని సతీసమేతుడై వెలిసినట్లు అర్చక పూజారులు, పూర్వీకులు చెబుతున్నారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు ఎన్నో ప్రయాసల కోర్చి కొండపైకి ఎక్కి మొక్కులు తీర్చుకుంటారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్త జనులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని తరిస్తారు. భక్తుల కొంగు బంగారమైన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కొండపైకి ఎక్కి.. ఆలయం ముందు సహజ సిద్ధంగా ఏర్పడిన కోనేరు (గుండం)లో స్నానమాచరిస్తారు. అనంతరం ఆలయంలోని స్వామి వారికి భక్తిశ్రద్ధలతో పూజలు, అర్చనలు గావించి మొక్కులు చెల్లిస్తారు. స్వామి వారిని దర్శిస్తే కోరిన కోర్కెలు నెరవేరి కష్టాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఏటా శ్రావణ మాసంలో నెల రోజుల పాటు స్వామి వారి ఉత్సవాలతో పాటు వేసవిలో మే లేదా జూన్ నెలలో స్వామి వారి జయంతి ఉత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తరిస్తారు.

రేపటి నుంచి జయంతి ఉత్సవాలు..

ఈనెల 8వ తేదీ ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు శ్రీవేల్పుగొండ లక్ష్మీనర్సింహస్వామి జయంతి ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా 8న కొండపై గల స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కలశాభిషేకాలు, జయంతి ఉత్సవం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారని పూజారి పొడిచేటి వెంకటాచార్యులు తెలిపారు. 11న బుధవారం దేవునికొండ దిగువన గల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీనారసింహుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జయంతి ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ఉత్సాహంగా బడిబాట ప్రారంభం

- గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించిన ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి
- సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరించిన టీచర్లు

8



శివునిపల్లి హైస్కూల్‌లో బడిబాట ప్రతిజ్ఞ చేస్తున్న హెచ్‌ఎం, టీచర్లు, అంగన్‌వాడీలు



మడికొండ ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించాలి

పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె. సత్యనారాయణరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బడిబాట కార్యక్రమం వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైంది. శుక్రవారం కాజీపేటలోని మడికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి కలెక్టర్ డాక్టర్ సత్యశారద బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండు జిల్లాల్లో మండల కేంద్రాల్లో ఎంఈవోలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భద్రకాళి మాడవీధుల పనుల పరిశీలన



మాడవీధులను పరిశీలిస్తున్న కమిషనర్, కుడా చైర్మన్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి మాడవీధులకు సంబంధించిన పనులను వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిలు శుక్రవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీవో అజీత్‌రెడ్డి, ఈఈ భీంరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జిలో దొరికిన మాజీ కౌన్సిలర్లు

పట్టించిన భార్య.. ఇద్దరికి దేహశుద్ధి ● మానుకోటలో చర్చనీయాంశం

మహబూబాబాద్ క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు మాజీ కౌన్సిలర్ల రాసలీలలు బట్టబయలయ్యాయి. పట్టణంలో వీరు ఓ లాడ్జిలో పట్టుబడ్డారు. వీరిని మాజీ కౌన్సిలర్ భార్య పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. మానుకోట పట్టణంలోని ఓ ప్రముఖ లాడ్జి గదిలో ఇద్దరు ఉన్నట్లు పక్కా సమాచారంలో మాజీ కౌన్సిలర్ భార్య తన బంధువులతో కలిసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం 100కు సమాచారం అందించగా పోలీసులు వచ్చి వారి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పట్టుబడ్డ మహిళ షీటీంలో సభ్యు రాలిగా పనిచేస్తున్నట్లు తెలిసింది.

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

హనుమకొండటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు ఈనెల 24న నిర్వహించే ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 8వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గొలనకొండ వేణు బీసీ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఆర్టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రాష్ట్ర మహాసభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్రరవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ హాజరవుతున్నారని చెప్పారు.

జోరుగా దరఖాస్తుల వెల్లువ

● రెవెన్యూ సదస్సులకు భారీ సంఖ్యలో రైతులు హాజరు ● ధరణిలో దొర్లిన తప్పులపైనే ఎక్కువ ఫిర్యాదులు

హనుమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నాలుగు రోజులుగా జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులు పలు సమస్యలపై దరఖాస్తులు సమర్పిస్తున్నారు. గతంలో ఇదే సమస్యలపై తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల్లో దరఖాస్తులు ఇచ్చినప్పటికీ పరిష్కారం కాలేదని, కనీసం ఇప్పుడైనా పరిష్కారమైన తమకు న్యాయం జరుగుతుందా? అని అడుగుతున్నారు. సదస్సుల్లో పలువురు రైతులు కొత్త పాస్‌పుస్తకాల్లో భూ విస్తీర్ణంలో తప్పులు, సాదాబైనామాలపై దరఖాస్తులు చేసుకుంటున్నారు. లంచాలు తీసుకొని, ఒకరి భూమిని మరొకరి పేరిట పట్టా చేయడం, భూమి లేకపోయినా పాస్ పుస్తకాలు ఇవ్వడం, భూమి ఉన్నా పాస్ పుస్తకాలు జారీ చేయకపోవడం వంటి అనేక తప్పులపై కూడా ఎక్కువగా దరఖాస్తులు దాఖలవుతున్నాయి. పౌతి కేసులు, సర్వే నెంబర్ మిస్సింగ్‌లు, డిజిటల్ సైన్ పెండింగ్ వంటి సమస్యలపై కూడా రైతులు ఎక్కువగా పిటిషన్లను దాఖలు చేస్తున్నారు. దీంతోపాటు రెవెన్యూ, ఫారెస్టు శాఖల మధ్య వివాదాస్పదంగా ఉండడం వల్ల పట్టాలు రాని రైతులు సైతం ఆ విషయాన్ని అధికారులు దృష్టికి పిటిషన్ల రూపంలో తీసుకువస్తున్నారు. సదస్సుల్లో దాఖలైన పిటిషన్లలో పెండింగ్ మ్యుటేషన్లు, సక్సెషన్ విస్తీర్ణంలో తప్పులకు సంబంధించినవి కూడా ఉంటున్నాయి. లావణి పట్టాభూములు, బాగా పంపిణీ సమస్యలపై కూడా పిటిషన్లు అందుతున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో సిబ్బంది నిర్లక్ష్యం, అధికారులు లాలూచీ వల్ల ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పులపైన అధికంగా ఫిర్యాదులు దాఖలవుతున్నాయి. ధరణి పోర్టల్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము ఎన్నో ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులు పలు సూచనలు చేస్తున్నారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు గత ప్రభుత్వాలు బంచరాయి ఇనాం భూములు ఇచ్చాయని, వాటికి పట్టాలు ఇప్పించి, బ్యాంకు రుణాలు తీసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఆ భూములను వారసత్వంగా వచ్చేలా చట్టంలో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొందరు రైతులు తమ గ్రామాల్లో కబ్జాకు గురైన చెరువులు, ప్రభుత్వ భూముల వివరాలను అధికారుల బృందం దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకువస్తున్నారు. ఈ భూములను ఆక్రమార్కుల చెర నుంచి కాపాడాలని కోరుతున్నారు. ఆ వివరాలను ఇచ్చిన తమ పేర్లను గోప్యంగా ఉంచాలని కోరుతున్నారు. సాదాబైనామాలపై దరఖాస్తులు చేసుకున్న రైతులకు అధికారులు ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందువల్ల ఈ విషయంలో తామేమి చేయలేమని అధికారులు రైతులకు స్పష్టం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై పరిష్కారం ఉంటుందని చెబుతున్నారు.



రాయపర్తి మండలం గట్టికల్ గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నాలుగో రోజు

భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులు నాలుగో రోజు శుక్రవారం హనుమకొండ, వరంగల్ జిల్లాలో జోరుగసాగాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ భూములకు సంబంధించిన సమస్యలను పేర్కొంటూ దరఖాస్తులను సమర్పించారు. తహసీల్దార్ల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు వీటిని స్వీకరించి అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో రికార్డు చేశాయి. హనుమకొండ జిల్లాలోని 13 మండలాల్లోని 13 రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం 1890 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ నాలుగు రోజుల్లో సదస్సుల్లో దాఖలైన మొత్తం దరఖాస్తుల సంఖ్య 5,607కు చేరుకున్నది. కాగా, వరంగల్ జిల్లాలో 13 మండలాలకుగాను పన్నెండింటిలో 24 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లాలో నాలుగోరోజు శుక్రవారం రెవెన్యూ సదస్సులు భీమదేవరపల్లి మండలంలో కొత్తకొండ, ధర్మసాగర్ మండలంలో క్యాతంపల్లి, ఎల్కతుర్తి మండలంలోని పెంచికల్‌పేట, హనుమకొండ మండలంలో పలివేల్పుల, ఐనవోలు మండలంలో వెంకటాపూర్, కమలాపూర్ మండలంలో గుండేడు, వేలేరు మండలంలో పీచర, కాజీపేట మండలంలో మడికొండ, హసన్‌పర్తి మండలంలో చింతగట్టు, దామెర మండలంలో కోగిల్వాయి, ఆత్మకూరు మండలంలో చౌళ్లపల్లి, పరకాల మండలంలో పైడిపెల్లి, శాయంపేట మండలంలో కాట్రపల్లిలో జరిగాయి.

వరంగల్ జిల్లా

రాయపర్తి మండలంలో గట్టికల్, ఊకల్, పర్వతగిరి మండలంలో అన్నారం షరీఫ్, ఖిలా వరంగల్ మండలంలో స్తంభంపల్లి, గాడెపల్లి, వరంగల్ మండలంలో ఏనుమాముల, సంగెం మండలంలో రామచంద్రాపూర్, పల్లారుగూడ, చెన్నారావుపేట మండలంలో అమీనాబాద్, ఎల్లయ్యగూడెం, దుగ్గొండి మండలంలో నాచినపల్లి, పొనకల్, నర్సంపేట మండలంలో నర్సంపేట, ముగ్దుంపురం, నల్లబెల్లి మండలంలో గోవిందాపూర్, రేలకుంట, గీసుకొండ మండలంలో వంచనగిరి, ఊకల్ హవేలి, నెక్కొండ మండలంలో ముదిగొండ, తోపనపల్లి, ఖానాపూర్ మండలంలో డబీర్‌పేట, మంగళవారిపేట గ్రామాల్లో సదస్సులు జరిగాయి. శనివారం బక్రీద్, ఆదివారం సెలవు అయినందు వల్ల 7,8 తేదీల్లో రెవెన్యూ సదస్సులు ఉండవు.

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి



వంశీతరుణ్

దుగ్గొండి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి మృతిచెందిన సంఘటన మండలంలోని తిమ్మంపేటలో శుక్రవారం తెల్లవారుజా మున చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. తిమ్మంపేటకు చెందిన దండు అన్వర్, హేమలత దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు దండు వంశీతరుణ్(22) వరంగల్‌లోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు, పేద కుటుంబం కావడంతో వంశీతరుణ్ వరంగల్‌లోని ఓ హోటల్‌లో పార్టుటైం పనిచేస్తూ చదువుకుంటున్నాడు. సంగెం మండలంలోని తిమ్మాపూర్‌లో శుభకార్యం ఉండగా ద్విచక్రవాహనంపై వెళ్లివస్తున్న క్రమంలో మామునూరు క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం తెల్లవారు జాము న బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వంశీతరుణ్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మామునూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఉన్నత చదువు కోసం వెళ్లి రోడ్డు ప్రమాదంలో వంశీతరుణ్ మృతి చెందడంతో గ్రామంలో విషాదం చెలకొంది. వంశీతరుణ్ మృతికి మెపా రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, మండల అధ్యక్షుడు ఒరంగటి తిరుపతిలు సంతాపం తెలిపి నివాళులర్పించారు.

9 నుంచి డీసెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డీసెట్-2025లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 9 నుంచి హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉంటుందని ఆయన తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 64 మంది ఎంపిక

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నిర్వహించిన నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో జిల్లాకు చెందిన 64 మంది ఎంపికైనట్లు ఇన్‌చార్జి డీఈవో మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి మొత్తం 628 మంది పరీక్షకు హాజరుకాగా అందులో 64 మంది ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ఎంపికైన విద్యార్థులకు సాలీనా రూ.12వేలు సదరు విద్యార్థికి ఇప్పటి నుంచి ఇంటర్మీడియెట్ రెండేళ్ల పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు.

బాలుడి కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు

వరంగల్ క్రైం, జూన్ 06 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్‌కు గురైన 3 ఏళ్ల బాలుడి ఆచూకీ కనిపెట్టి తల్లితండ్రులకు అప్పగించినట్లు హనుకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. యాదవనగర్‌కు చెందిన రుద్రవేణి నరేశ్, జ్యోతి దంపతుల 3 ఏళ్ల బాబు ఆడుకుంటా కనిపించకుండా పోయాడని బాలుడి తల్లితండ్రులు ఫిర్యాదు చేశారు. గాలింపు చేపట్టగా భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మంథనికి చెందిన బాలుడి మేనమామ తాండ్ర ప్రశాంత్ కుటుంబ ఘర్షణల మధ్య కిడ్నాప్ చేశాడని తెలియడంతో ఆదుపులోకి తీసుకొని తల్లితండ్రులకు అప్పగించామన్నారు.



బాలుడిని తల్లితండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ప్రముఖుల పేర్లతో సైబర్ మోసం

● డబ్బులున్నాయి.. ఫోన్ పే చేయండని వల ● మోసపోతున్న అమాయకులు ● ఏటూరునాగారం ప్రాంతంలో సరికొత్త దందా

ఏటూరునాగారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు కొత్త మోసాలకు పాల్పడుతూ వ్యాపారులు, ప్రముఖ వైద్యులను ఆందోళనకు గురిచేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు చేస్తున్న ఫోన్ కాల్స్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. స్థానికంగా పేరున్న వైద్యుల పేరు చెప్పి, అత్యవసరంగా డబ్బులు కావాలంటూ.. నీకు క్యాష్ ఇస్తా.. నాకు ఫోన్‌పే చేస్తావా.. అంటూ ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నగదు వారి అకౌంట్‌లోకి బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా శుక్రవారం మండల కేంద్రంలోని ఆరాధ్య హాస్పిటల్ డాక్టర్ పేరుతో, ఆస్పత్రి పక్కనే ఉన్న ఓ గ్రాఫిక్స్ సెంటర్ యజమానికి సైబర్ నేరగాళ్ల నుంచి కాల్ వచ్చింది. 'హలో, నేను ఫలానా వైద్యశాల నుంచి కాల్ చేస్తున్నాను. నీకు క్యాష్ ఇస్తాను.. నాకు మూడు వేలు ఫోన్‌పే చేయండి..' ఇలాంటి మాటలతో సైబర్ నేరగాళ్లు వ్యాపారులకు కాల్స్ చేస్తున్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో రెండు, మూడు రోజులుగా ఇలాంటి కాల్స్ చేసి సైబర్ నేరగాళ్లు డబ్బులు వసూలు చేస్తున్న సంఘటనలు కలకలం రేపుతున్నాయి.

మూడు రోజుల కిందట..

మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యశాల డాక్టర్ పేరు చెప్పి సైబర్‌నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఓ జువెలరీ షాప్‌కు చెందిన మహిళకు కాల్ వచ్చింది. 'మా దగ్గర నగదు ఉంది.. ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించండి' అని సైబర్ నేరగాళ్లు ఆ మహిళను కోరారు. ఎదురుగా ఉన్న వైద్యశాల డాక్టర్ ఫోన్ చేసినప్పుడు డబ్బులు పంపించకుంటే ఏమనుకుంటాడోనని భావించిన ఆ మహిళ.. వెంటనే ఫోన్‌పే ద్వారా వారు చెప్పిన నంబరుకు డబ్బులు పంపించింది. కొద్దిసేపు వేచి చూసిన తర్వాత, సదరు డాక్టర్ నంబర్‌కు ఆ మహిళ తిరిగి కాల్ చేసింది. అయితే, తాను కాల్ చేయలేదని, ఎవరు చేశారో తెలియదని డాక్టర్ సమాధానం ఇచ్చాడు. దీంతో ఆ మహిళ ఖంగుతింది. అంతేకాకుండా, తాను డబ్బులు పంపిన ఫోన్‌పే నంబర్ కూడా తమది కాదని డాక్టర్ చెప్పడంతో, తాను మోసపోయినట్లు ఆ మహిళ గుర్తించింది. వ్యాపారులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు చేస్తున్న ఈ కొత్తరకం మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

మోదీ విధానాలతో తీవ్ర ఆర్థిక అసమానతలు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

హనుమకొండ చౌరస్తా, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ విధానాలతో సమాజంలో తీవ్ర ఆర్థిక అసమానతలు ఏర్పడుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ స్పష్టం చేశారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్యభవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. కేంద్రలో బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశంలో కార్మికవర్గంపై దాడి జరుగుతోందన్నారు. దానిని ప్రతిఘటించేందుకు జూలై 9న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక లోకం పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్నాయని, కొందరి చేతుల్లోనే సంపద కేంద్రీకరణ కావడంతో, దేశంలో సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రేలాపనలు, టారీఫ్‌ల పెంపులు కూడా పెట్టుబడిదారీ విధాన సంక్షోభంలో భాగమేనన్నారు. ఇతర దేశాల సరుకులపై పన్నుల భారం మోపడం ద్వారా తన సంక్షోభాన్ని తప్పించుకునే పనిలో అమెరికా ఉందని తెలిపారు. 30, 40 ఏళ్లుగా అమెరికా ఉత్పత్తి ప్రక్రియను ఆపేసి చౌకగా కార్మిక శక్తి దొరికే ప్రాంతాలకు మళ్లించిన తీరును వెంకటేష్ వివరించారు. మోదీ సర్కారు లేబర్‌కోడ్‌లను తీసుకవచ్చి కార్మిక వర్గంపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. పహల్గామ్ ఉగ్ర ఘటన నేపథ్యంలో సార్వత్రిక సమ్మెను జూలై 9కి వాయిదా వేయాలని అన్ని కార్మిక సంఘాలు సమష్టి నిర్ణయం తీసుకున్నాయని వెంకటేష్ తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ.. గుజరాత్ రాష్ట్రంలో కార్మికవర్గంపై దాడి దుర్మార్గమన్నారు. కర్నాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాన్ని బేఖాతరు చేస్తూ రాత్రి షిఫ్టులోనూ మహిళలను పని చేయాలని ఆదేశాలు జారీచేయడం సరికాదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో ఆఫీస్ బేరర్లు జి.ప్రభాకర్‌రెడ్డి, బొట్ల చక్రపాణి, మెట్టు రవి, పుల్ల అశోక్, బి.మహేష్, కె.ఐలయ్య, జిల్లా కమిటీ సభ్యులు యాకయ్య, యాస బాబు, మందల శ్రీనివాస్, కల్పన, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

రైళ్లకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు

కాజీపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైళ్ల రాకపోకలకు ఆటంకం కలిగించినందుకు పలువురిపై ఆర్పీఎఫ్ సిబ్బంది కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాజీపేట ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చటర్జీ తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేట్ మూసి ఉన్నా ఎమ్మెల్సీ సిరికొండ మదుసూధనాచారి తనయుడు ప్రశాంత్ అతడి బృందం రైల్వే గేట్ తెరవాలని గేటు ముందు ఆందోళనకు దిగారు. దీంతో రైళ్ల రాకపోకలకు ఆటంకం కలిగింది. ఆ 14మందిపై ఆర్పీఎఫ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు సిరికొండ ప్రశాంత్, తాటి జనార్దన్, గురుకుంట్ల కిరణ్, ఎర్లరాజు, కంచెర్ల ప్రకాశ్, శశికాంత్ గౌడ్, బియాని పూర్ణను అరెస్ట్ చేసి వారి పూచికత్తుపై వదిలిపెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మరికొందరు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

పట్టాలు దాటిన వారిపై కేసు

రైల్వే నిషేధిత ప్రాంతం వద్ద పట్టాలు దాటిన 10 మందిపై ఆర్పీఎఫ్ సిబ్బంది కేసులు నమోదు చేశారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ చటర్జీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట - పెండ్యాల రైల్వేస్టేషన్ మధ్య శుక్రవారం రైల్వే గేటు మీదుగా రైలు పట్టాలు దాటిన 10 మంది పాదచారులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వారిని రైల్వే కోర్టుకు హాజరుపర్చనున్నట్లు తెలిపారు. రైళ్లపై రాళ్లు విసిరినా, రైలు పట్టాలపై రాళ్లు పెట్టినా చర్యలు తప్పవన్నారు. అనంతరం రైల్వే గేట్ వద్ద పాదచారులకు అవగాహన కల్పించారు. అనంతరం పెండ్యాల- కాజీపేట మధ్య నడిచే రైళ్లకు బందోబస్త్ నిర్వహించారు.



బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్ సీ చటర్జీ

ఆపదలో 'ఆదాయ శాఖ'

● శిథిలావస్థకు చేరిన ఇన్‌కామ్‌టాక్స్ భవనం ● నైజాం కాలంలో నిర్మాణం ● నూతన భవనం నిర్మించాలంటున్న ప్రజలు



వరంగల్ రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆయికార్ భవన్

వరంగల్ చౌరస్తా, జూన్6 (ఆంధ్రజ్యోతి): నైజాం కాలంలో వరంగల్‌లో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాల్లో 'ఆయకర్ భవనం ఒకటి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇందులోనే ఆదాయపు పన్ను శాఖ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలకు ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కార్యాలయం ఇదే. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. గోడలపై చెట్లు మొలిచి వృక్షాలవుతున్నాయి. దీని స్థానంలో నూతన భవన నిర్మాణం కోసం కొన్నేళ్లక్రితమే ప్రతిపాదనలుపంపగా కేంద్ర ఆదాయపు పన్ను శాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిధులు కూడా కేటాయించినట్లు సమాచారం. ఈకార్యాలయం రైల్వేస్టేషన్ రోడ్డులో ఉండడంతో ఇక్కడ నిత్యం రద్దీ ఎక్కువగా ఉంటుంది. జన సమ్మద్రం ఎక్కువగా ఉంటుంది. ప్రమాదం జరగకముందే పాలకులు స్పందించి పాత భవనాన్ని తొలగించాలని, నూతన నిర్మాణం చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

చెరువులన్నీ మట్టిదిబ్బల పాలు

సింగరేణి ఓసీలతో నీటి వనరుల ధ్వంసం

- ఇరిగేషన్ శాఖకు పరిహారం చెల్లించకుండానే చెరువుల ఆక్రమణ
- మట్టి కుప్పలు పోసిన చెరువుల్లో మిషన్ కాకతీయకు రూ. కోట్ల ఖర్చు
- భూపాలపల్లిలోని ఓపెన్‌కాస్ట్-3 పరిధిలో ఇష్టారాజ్యం



నగరంపల్లి శివారులోని రాజమ్మకుంటలో పోసిన ఓసీ-3 మట్టి కుప్పలు

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బొగ్గు తవ్వకాల పేరుతో సింగరేణి అధికారులు నీటి వనరులను ఛిద్రం చేస్తున్నారు. బొగ్గు తవ్వకాల పరిసరాల్లో ఉన్న చెరువులు, కుంటలను అక్రమంగా వాడకుంటు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని ఓపెన్‌కాస్ట్-3 పరిధి బయట ఉన్న జలవనరులను సింగరేణి ధ్వంసం చేస్తోంది. ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండా, పరిహారం చెల్లించకుండా మట్టిదిబ్బలతో కుంటలను నింపేస్తున్నారు. ఓసీ- 3 పరిధిలోని గణపురం మండలం నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట,మాదిగకుంట,సుద్దకుంటలను మట్టితో నింపేశారు. ఈ కుంటలకు చెందిన దాదాపు 45 ఎకరాల భూముల్లో మట్టి పోశారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ బొగ్గు తవ్వకాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నా సంస్థ తన పద్ధతిని మార్చుకోవడం లేదు. ఒక వైపు ఓసీ(ఓపెన్ కాస్ట్)లతో భూగర్భ జలాలు అడుగుంటుతుండగా, మరోవైపు తవ్వకాల పరిధి బయట ఉన్న నీటి వనరులను ధ్వంసం చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో ఓసీ-3ని ఇప్పటికే ఏర్పాటుచేసి తవ్వకాలు చేస్తున్న సింగరేణి... తవ్విన మట్టిని పక్కనున్న చెరువుల్లో, కుంటల్లో డంప్ చేస్తోంది. తద్వారా నీటి వనరులు ధ్వంసం కావడంతో పాటు పర్యావరణంకు నష్టం జరుగుతోంది. ఓసీ-3 తవ్వకాలకు 3,201 ఎకరాలను భూసేకరణ చేయాలని నిర్ణయించిన సింగరేణి చాలా వరకు భూసేకరణ చేపట్టి పనులు ప్రారంభించింది. ఓసీ-3 పేరిట ఇప్పటికే చాలా చెరువులు, కుంటలను మింగిన సింగరేణి తన పరిధిలో లేని నీటి వనరులను ఇప్పుడు ధ్వంసం చేయడం ప్రారంభించింది.

మిషన్ కాకతీయతో రూ. కోట్లల్లో పనులు

ఓసీ-3 పేరిట సింగరేణి మట్టి కుప్పలుగా మార్చిన గణపురం మండలంలోని నగరంపల్లి శివారులోని రాజమ్మ కుంట, మాదిగకుంట,సుద్దకుంటల అభివృద్ధికి నీటిపారుదల శాఖ అధికారులు రూ. కోట్లు ఖర్చు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ మూడు కుంటల అభివృద్ధికి రూ. కోటికిపైగా వెచ్చించి, అభివృద్ధి పనులు చేయించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు ఈ కుంటల్లో స్థానిక మత్స్యకారులు చేపలు పట్టుకొని జీవనోపాధి పొందేవారు. సింగరేణి తీరుతో ప్రభుత్వానికి రూ. కోట్లల్లో నష్టం రావడంతో పాటు స్థానిక మత్స్యకారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొంది.

అనుమతులు లేకుండానే

గణపురం మండలంలోని నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట, మాదిగకుంట,సుద్దకుంటలకు చెందిన సుమారు 45 ఎకరాల్లో సింగరేణి ఓసీ-3 మట్టి నిల్వలను పోసింది. రాజమ్మ కుంట కింద 40 ఎకరాలు, మాదిగకుంట కింద 40 ఎకరాలు, సుద్ద కుంట కింద 135 ఎకరాల ఆయకట్టు ఉంది. ఓసీ-3లో భూములు కోల్పోతున్న రైతులకు కొంత మందికి మాత్రమే పరిహారం అందగ మిగిలిన వారికి ఇప్పటికీ పరిహారం అందలేదు. ఓసీ-3 పరిధిలో లేని నీటి వనరుల్లో సింగరేణి అధికారులు వాల్టా చట్టం నిబంధనలు పక్కన పెట్టి మట్టి కుప్పలు పోశారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండా, పరిహారం చెల్లించకుండా సింగరేణి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న తరుణంలో ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులు, కుంటల కట్టలు, తూములను పరిశీలించే క్రమంలో ఈ మూడు కుంటల్లో సింగరేణి మట్టి కుప్పలు పోసిన వ్యవహారం బహిర్గతమైంది.



నగరంపల్లి శివారులోని రాజమ్మకుంటలో పోసిన ఓసీ-3 మట్టి కుప్పలు

హైకోర్టుకు

గణపురం మండలంలోని నగరంపల్లి శివారులోని రాజమ్మకుంట, మాదిగకుంట,సుద్దకుంటల్లో అక్రమంగా మట్టి కుప్పలు పోసిన సింగరేణి అధికారుల తీరుపై ఇరిగేషన్ శాఖ అధికారులు హైకోర్టు మెట్లెక్కిందుకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే సింగరేణికి లేఖ ద్వారా అభ్యంతరాలు తెలిపిన అధికారులు.. సింగరేణి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో హైకోర్టుకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. భూనిర్వాసితులకు పరిహారం చెల్లించడంతో పాటు భూములు కోల్పోతున్న ప్రభుత్వ సంస్థల భూములకు పరిహారం చెల్లించడం, మరోచోట భూమిని అభివృద్ధి చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా ఓసీ-3లో మట్టి నిల్వలు పోసిన కుంటలకు కుడా సింగరేణి ఇరిగేషన్‌శాఖకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. పరిహారం చెల్లించాల్సి వస్తే మూడు కుంటలకు కలిపి రూ. 11 కోట్లు చెల్లించాలని ఇరిగేషన్ శాఖ కోరుతోంది. లేదంటే సింగరేణి ఎంత భూమి వాడుకుంటుందో అంత భూమితో మరోచోట చెరువులను తవ్వి ఇవ్వాల్సి ఉంటుందని ఇరిగేషన్‌శాఖ అధికారుల వాదన. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు సింగరేణికి చెరువుల ధ్వంసంపై లేఖ కుడా రాయడం జరిగింది. సింగరేణి ఇప్పటివరకు ఇరిగేషన్‌శాఖ లెటర్‌పై స్పందించిన దాఖలాలు లేవు. దీంతో ఇరిగేషన్ శాఖ అధికారులు సింగరేణి ద్వారా కోల్పోతున్న కుంటలకు సంబంధించి న్యాయం చేయాలని హైకోర్టులో కేసు నమోదు చేసేందుకు సిద్ధం అయినట్లు సమాచారం.

అనుమతులు లేకుండానే..



అనుమతి లేకుండానే, ఎటువంటి పరిహారం చెల్లించకుండా సింగరేణి ఓసీ-3 మట్టి నిల్వలను నగరంపల్లి శివారులోని రాజమ్మ కుంట, మాదిగకుంట,సుద్దకుంటల్లో పోసింది. దీంతో కుంటలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. స్థానిక మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. మట్టి నిల్వలపై ఇప్పటికే సింగరేణి యంత్రాంగంకు లేఖ రాయడం జరిగింది. త్వరలోనే సింగరేణి వైఖరిపై హైకోర్టులో కేసు నమోదు చేయనున్నాం.

- బసవ ప్రసాద్, ఈఈ భూపాలపల్లి డివిజన్



కాళేశ్వరం - మహదేవపూర్ జాతీయ రహదారి ఇదే

జాతీయ రహదారి.. ప్రమాదకరంగా మారి..

- పెండింగ్‌లోనే ఉంటున్న జాతీయ రహదారి 353 సీ పనులు
- కేంద్ర అటవీశాఖ అనుమతుల కోసం ఎదురుచూపులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు

మహదేవపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి అంటే రయ్ రయ్ మంటూ ఎలాంటి అడ్డంకులు.. గుంతలు.. ఇబ్బందులు లేకుండా ప్రయాణం చేయొచ్చు.. ఇక్కడ మాత్రం అలా కాదు.. జాతీయ రహదారికి భిన్నంగా 353-సీ ఉంటుంది. వాహనదారులు ఏమరపాటుగా ఉన్నారంటే అంతే సంగతులు ప్రమాదం తప్పని సరి.. 17 కిలోమీటర్ల రహదారి వెడల్పు కోసం వంద కారణాలు అడ్డు వస్తున్నాయి. ఒక పని ముందుకు పడితే మరో పని వెనుకపడుతోంది. అనుమతులు వస్తాయని అటవీశాఖ కోసం ఎదురుచూడాల్సిన పని. సరస్వతి పుష్కరాల సమయంలో గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచినా సమస్య పరిష్కారానికి మార్గం చూపడం లేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్- కాళేశ్వరం 353 సీ జాతీయ రహదారిలో 17 కిలోమీటర్ల మార్గం అధ్వానంగా మారింది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు అయిన ఈ రహదారి మీదుగానే అంతరాష్ట్ర రాకపోకలు జరుగుతాయి. ఈ రహదారి విస్తరణకు ఏళ్లుగా ఎదురుచూపులే మిగులుతున్నాయి. 2022 నవంబరు 12న ప్రధాని మోదీ రామగుండం పర్యటనలో భాగంగా విస్తరణ పనులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవం చేసినా అటవీ శాఖ అభ్యంతరాలతో ముందడుగు పడడం లేదు. ఇటీవల జరిగిన సరస్వతి పుష్కరాలకు లక్షలాది మంది తరలిరావడంతో ఈ మార్గంలో రహదారి విస్తరణ జరగక కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామయింది. 2027లో గోదావరి పుష్కరాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో రహదారి విస్తరణ తప్పనిసరిగా మారింది.

అటవీశాఖ అడ్డంకి..

మహదేవపూర్- కాళేశ్వరం మధ్య మహారాష్ట్ర సిరొంచకు వెళ్లే మార్గంలో 17 కిలోమీటర్ల వరకు పనులు జరగడం లేదు. ఇందులో సుమారు 15 కిలోమీటర్లు అటవీశాఖ ఆధీనంలో ఉండడంతో అటవీశాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో రహదారి విస్తరణ పనులు అటకెక్కాయి. ఈ మార్గంలో 109 రకాలకు చెందిన 7529 చెట్లను తీసివేయాల్సి ఉండగా వీటి విలువ సుమారు 2 కోట్లపైనే అధికారులు అంచనా వేశారు. జాతీయ రహదారి, అటవీశాఖ అధికారులు కలిసి తొలగించే వృక్షాలకు గుర్తులు వేశారు. యూజర్ ఏజన్సీ అటవీశాఖకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అనుమతులు కోసం కేంద్ర అటవీశాఖకు లేఖ పంపి సంవత్సరం దాటినా ఇంతవరు అనుమతులు రాకపోవడం గమనార్హం. మరో వైపు కాళేశ్వరం నుంచి కన్నెపల్లి మూలమలుపు వరకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు నిర్మాణం చేయాల్సి ఉండగా రైతులు భూములు ఇవ్వడం లేదు. దీంతో ఈ పనులు అలాగే మిగిలిపోయాయి.

అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం..

మహదేవపూర్, కాళేశ్వరం జాతీయ రహదారి నిర్మాణం కోసం కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంటుంది. ఇప్పటికే నివేదికలు పంపాం. అనుమతులు రాగానే టెండర్లు వేసి పనులు ప్రారంభిస్తాం.

- మనోహర్, ఈఈ, జాతీయ రహదారులు

కేయూలో ఉద్రిక్తత

- పౌరహక్కుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు
- తీవ్ర నిరసన తెలిపిన ప్రజాసంఘాల నేతలు
- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి: పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

కేయూ క్యాంపస్ జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూ ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో పీడీఎస్‌యూ నేతృత్వంలో ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఉదయం 10గంటలకు ఫార్మసీ కళాశాల వద్దకు రౌండ్ టేబుల్ సదస్సులో పాల్గొనేందుకు ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నేతలు తరలివచ్చారు. విషయం తెలుసుకున్న వర్సిటీ పోలీసులు ఫార్మసీ కళాశాల వద్దకు చేరుకుని సమావేశం వద్దంటూ నేతలను వెళ్లిపోవాలని సూచించారు. తాము రౌండ్ టేబుల్ సదస్సుకు వర్సిటీ ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందామని పోలీసులకు విన్నవించినప్పటికీ అనుమతి లేదంటూ సమావేశాన్ని జరగనివ్వకపోవడంతో ఫార్మసీ కళాశాల బిల్డింగ్ నుంచి ప్రజా సంఘాల నేతలు బయటకు వచ్చారు. పోలీసుల తీరును నిరసిస్తూ ప్రజా సంఘాల నేతలు వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి మొదటి గేటు వరకు నిరసన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశంలో శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. పీడీఎస్‌యూ రౌండ్‌టేబుల్ సదస్సు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలు నిరసించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు, పౌర ప్రజాస్వామిక సంఘాలు కార్యక్రమాలు చేపట్టాయని అన్నారు. రౌండ్ టేబుల్ సదస్సు నిర్వహించే హాల్‌కు పోలీసులు తాళాలు వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పాలనకు తేడా ఏమీలేదన్నారు. మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణ పాటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాణి, నేతలు జయంత్, టీపీఎస్ రాష్ట్ర నేతలు బి.రమాదేవి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బండి కోటేశ్వర్‌రావు, భారత్ బచావో నేతలు వెంగల్‌రెడ్డి, ప్రవీణ్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అజయ్, డీఎస్‌పీ నేతలు శివ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, ఉదయ్‌సింగ్, చార్వాక బాసిరెడ్డి, జనగాం కుమారస్వామి, హరిబాబుతో పాటు విద్యార్థి సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెర తీసి.. మొదటి కల్లు పోసి..

- ఘనంగా పండుతాళ్ల కల్లు పండుగ
- గ్రామ పెద్దలను తాటివనానికి ఆహ్వానించిన గీతకార్మికులు
- జనగామ జిల్లా ఇప్పగూడెంలో అనాదిగా వస్తున్న ఆచారం



కల్లు పండుగలో భాగంగా గ్రామ పెద్దలకు కల్లు వంచుతున్న గీతకార్మికులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో శుక్రవారం గీతకార్మికులు పండుతాళ్ల కల్లు పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతీ యేడు లాగానే తాటిచెట్ల నుంచి పండుతాళ్ల కల్లు రాగానే కులాలకు అతీతంగా గ్రామానికి చెందిన పెద్దలను తాటివనానికి గీతకార్మికులు ఆహ్వానించారు. అతిథులను ఒక దగ్గర కూర్చోబెట్టి చెట్ల నుంచి వచ్చిన మొదటి కల్లు పోయడంతో పాటు గుడాలను అందించారు. వివిధ కులాలకు చెందిన కుల పెద్దలకు, కల్లు ప్రియులకు గీతకార్మికులు ఏమి ఆశించకుండా కల్లుపోసి గుడాలు అందించి పండుతాళ్ల కల్లు పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా గీతకార్మికులు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పండుతాళ్ల పండుగను నిర్వహించే సంస్కృతి గ్రామంలో ఉందన్నారు. పూర్వకాలం నుంచి పండుతాళ్ల కల్లుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. వేసవి కాలం మొదలు సమయంలో పరుపుతాళ్ల ఉంటాయన్నారు. అనంతరం కార్మికులం తాటిచెట్టుకు ఉన్న తాటికాయలను కోస్తూ కల్లు పారడానికి గాను కత్తులతో మెరలు తీస్తామని తెలిపారు. తాటిగెలల నుంచి కల్లు పారడానికి అనేక రోజులు శ్రమించాలని చెప్పారు. అనేక మార్లు వ్యయ ప్రయాసలకు ఓర్చి గెలలకు ఓపికతో మెరలు పెట్టినప్పుడు కల్లు పారుతుందన్నారు. మొదటిగా తాటిచెట్ల నుంచి తీసిన పండుతాళ్ల కల్లును వనం మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ దేవతలకు సాక పోసి కల్లు పండుగను నిర్వహించడం జరిగిందన్నారు. ఆతిథ్యం స్వీకరించిన గ్రామ పెద్దలు తోసిన విధంగా కట్నాలుగా కార్మికులకు డబ్బులు అందిస్తారని పేర్కొన్నారు. గీతకార్మికులు జూలూరు వెంకటేశ్వర్లు, జూలూరు మహేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భాస్కర్ గౌడ్, రాజుగౌడ్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్‌లో ఉన్న మరుగుదొడ్ల పనులు

ఇంకా పెండింగ్‌లోనే..!

పుష్కరాలు పూర్తయినా పూర్తి కాని పనులు

మహదేవపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో పుష్కరాలు విజయవంతంగా పూర్తయ్యాయి. కాని పుష్కరాల కోసం విడుదల చేసిన నిధులతో ఏర్పాటు చేసిన పనులు మాత్రం ఇంకా పూర్తి కాలేదు.. నిత్యం కాళేశ్వరానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు గాను గోదావరి ఒడ్డున ప్రత్యేకంగా సరస్వతి ఘాట్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక దృష్టి సారించి రూ.35 కోట్లు కేటాయించినా అందుకు సార్థకత ఉండడం లేదు. పుష్కరాల ముందు మొదలు పెట్టిన పనులు ఇంతవరకు పూర్తికాకపోవడం విడ్డూరమని పలువురు విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ చేపట్టిన ఆర్చిగేటు, కళ్యాణకట్ట, బట్టలు మార్చుకునే గది, మూత్రశాలల, మరుగుదొడ్ల పనులు మాత్రం మధ్యలోనే ఆగిపోయాయి.

పనులు ఆలస్యంగా ప్రారంభించడం.. ఇంతలోనే పుష్కరాలు రావడంతో స్లాబ్ లెవల్ పనులు పూర్తి చేసి అలాగే వదిలేశారు. ప్రసాదశాల పనులు ఇంతవరకూ పూర్తికాలేదు. రూ.కోట్లు వృధాగా పోతున్నాయని, వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భక్తులకు సౌకర్యంగా ఉండేలా పెండింగ్ పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



స్లాబ్‌కే పరిమితమైన కల్యాణ కట్ట పనులు

సాగుకోసం..సలహాదారుడు

- ప్లాంటిక్స్ యాప్ అందుబాటులోకి తెచ్చిన 'ఇక్రిసాట్'
- అన్ని సమస్యలకు పరిష్కారం చూపేలా రూపకల్పన
- చీడపీడల ఫొటో తీసి పంపితే క్షణాల్లో నివారణ చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

రైతుల కోసం ఓ యాప్ అందుబాటులోకి వచ్చింది. సాగులో ఎదురయ్యే అన్ని సమస్యలకు ఇది పరిష్కారం చూపుతుంది. తగిన సలహాలు సూచనలు అందిస్తుంది. పంట తెగుళ్లు, చీడపీడలు, క్రిమి కీటకాలకు సంబంధించిన ఫొటోలు పంపిస్తే నివారణ చర్యలను సూచిస్తుంది. వాతావరణ వివరాలు, గాలిలో తేమ, ఉష్ణోగ్రత వివరాలను తెలియజేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే మీ స్మార్ట్ ఫోన్‌లో ఈ యాప్ ఉంటే ఒక శాస్త్రవేత్త మన దగ్గర ఉన్నట్టే..



ప్లాంటిక్స్ యాప్ సమాచార చిత్రాలు

వరంగల్ వ్యవసాయం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక యుగంలో వ్యవసాయానికి కొత్త హంగులు అద్దుతూ సాంకేతితను జోడిస్తూ హైదరాబాద్ ఇక్రిసాట్ విశ్వవిద్యాలయం వ్యవసాయదారుల కోసం ప్లాంటిక్స్ అనే యాప్‌ను రూపొందించింది. రాష్ట్రంలో, దేశంలో ఏ మూలన ఉన్నా సరే.. అరచేతిలోనే మీ సమస్యలకు పరిష్కారం చూపుతుంది. ఇందుకోసం గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి ప్లాంటిక్స్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. ఇందులో అన్ని పంటలకు సబంధించిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్యపద్ధతులు, చీడపీడలు, తెగుళ్ల నివారణ, పోషకాలు, సూచనలు, సలహాలు ఒకటేమిటి రైతుకు సంబంధించిన సమస్త సమాచారం ఈ యాప్ ద్వారా పొందవచ్చు. గతంలోనైతే పంట వేసిన అనుభవజ్ఞులైన రైతులు, లేదా వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకునే వారు. ఇప్పుడు పంటకు పట్టిన చీడపురుగు, తెగుళ్లకు సంబంధించిన ఫొటోలు తీసి పంపితే చాలు దాని నివారణ కోసం ఏం చేయాలనేది యాప్ ద్వారా పూర్తిసమాచారం తెలుసుకోవచ్చు.

సమస్య ఏదయినా పరిష్కారం సూచిస్తుంది..

కూరగాయలు, పండ్ల తోటలు, పప్పు దినుసులు, అపరాలు ఇలా ఏ పంట పండించినా వాటి సాగు విధానం, సస్యరక్షణ చర్యల గురించి ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. వాతావరణ పరిస్థితులు, గాలిలో తేమ, వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలిలో వేగం తదితర అన్ని అంశాలను ఇందులో పొందుపరిచారు. ఫోన్ జీపీఎస్ ఆన్ చేస్తే చాలు ఆ ప్రాంతానికి సంబంధించిన సమాచారమంతా వెల్లడిస్తుంది.

సమస్త సమాచారం..

ప్రాంతం, బాష ఏదయినా సరే మీ పంటకు సంబంధించిన సమస్యలకు ప్లాంటిక్స్ యాప్ పరిష్కారం చూపుతుంది. ఇక పంట తెగుళ్లు, చీడపీడల సమస్యలను నిపుణులకు తెలియజేయడంతో పాటు వాటి పరిష్కారాన్ని పొందే అవకాశం కూడా ఈ యాప్‌లో ఉంది. సమస్యలకు సంబంధించిన ఫొటోలను తీసి పంపితే వెంటనే ఆ పంటకు సోకిన వ్యాధి ఏమిటో వెల్లడిస్తుంది. అంతేకాదు ఆ వ్యాధికి వాడాల్సిన పురుగు మందులను కూడా సూచిస్తుంది. అవి ఏ మోతాదులో వాడాలో కూడా వివరిస్తుంది. యాప్‌లో కమ్యూనిటీ అప్షన్‌లోకి వెళితే.. సహచర రైతులు, నిపుణులు, శాస్త్రవేత్తలతో రైతుల అనుభవాలు, సందేహాలను పంచుకునే అవకాశం ఉంటుంది. పంటలాభాన్ని అంచనా వేసుకోవచ్చు. తనకు సమీపంలో ఏయే ఎరువులు, పురుగుమందుల దుకాణాలు అందుబాటులో ఉన్నాయో కూడా ఇది చూపిస్తుంది.

యాప్ చాలా అద్భుతంగా ఉంది..



పంటలకు సంబంధించిన సమస్త సమాచారం తెలుసుకోవడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ యాప్ ఉంటే ఒక శాస్త్రవేత్త మన వెంట ఉన్నట్టే. పంట చేల గురించి ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఈ యాప్ రైతులందరికీ చేరితే బాగుంటుంది.

- భూక్యా బాలునాయక్, రైతు, మరిపెడ

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రమేశ్

జఫర్‌గడ్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని ముగ్దుంతండా పరిధిలోని అవుసుల తండాకు చెందిన జువారి రమేశ్ రెండోసారి ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈయన సీపీఐ మండల కార్యదర్శిగా కొనసాగుతున్నారు. రెండు రోజుల పాటు జిల్లాలోని నర్మెటలో జరిగిన సీపీఐ జిల్లా మహాసభల్లో జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జువారి రమేశ్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పార్టీ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు టి.శ్రీనివాసరావు, సిహెచ్.రాజారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, తన ఎన్నికకు సహకరించిన పార్టీ జిల్లా, మండల ప్రతినిధులకు రమేశ్ కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మానస కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

జఫర్‌గడ్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మడపల్లి(జి)లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉప్పునూతుల మానస కుటుంబాన్ని సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, నాయకులు వడ్లకొండ సుధాకర్ తదితరులు శుక్రవారం పరామర్శించారు. గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు మృతురాలి భర్త లక్ష్మణ్ కుటుంబీకులను ఓదార్చారు. తలా కొంత డబ్బును పోగు చేసి ఆ నిరుపేద కుటుంబానికి రూ.11,200 ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు చిలువేరు మల్లేశ్, పెద్దరాములు, నక్క యాకయ్య, రాపర్తి రజిత, ముక్కెర రాజు, చిన్న రాములు, వికె.రాజు, పి.నాగరాజు, రమేశ్, లక్ష్మి, ఎల్లమ్మ, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలు మంజూరు చేయాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య



బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకులు రైతులకు పంట రుణాలను మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. పంట రుణాలు మంజూరు చేయాలని కోరుతూ స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట రైతు సంఘం నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించా రు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ నిబంధనల మేరకు బ్యాంకులు 18 శాతం పంట రుణాలను, 22 శాతం దీర్ఘకాలిక రుణాలను అందించాల్సి ఉన్నప్పటికి నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద ఎక్కువ వడ్డీకి అప్పులు తీసుకొని చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అదాని, అంబాని లాంటి బడా బాబులకు సంబంధించిన వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తుందే తప్ప దేశానికి అన్నంపెట్టే రైతులకు పంటరుణాలు ఇవ్వడానికి మనస్సు రావడం లేదన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి లింగనబోయిన కుమారస్వామి, బిక్షపతి, యాకయ్య, గణేష్, మొగిలి, శ్రీను పాల్గొన్నారు.

భూ భారతితో భూ సమస్యలు దూరం

- జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో భూ సమస్యలు దూరమవుతాయని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) రోహిత్‌సింగ్ అన్నారు. జనగామ జిల్లా ఎల్లంలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకొచ్చి రశీదు కచ్చితంగా ఇవ్వాలన్నారు. చట్టాన్ని అనుసరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుల్లో భాగంగా వచ్చే సమస్యలను రిజిస్టర్లలో జాగ్రత్తగా నమోదు చేయాలని అన్నారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

రఘునాథపల్లి : భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మాదారంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును శుక్రవారం సందర్శించి పరిశీలించారు. రైతులకు సంబంధించిన భూ సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి స్వీకరించిన భూ సమస్యలకు సంబంధించిన వివరాలను రిజిస్టర్లలో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం హెల్ప్ డెస్క్‌ను పర్యవేక్షించి పలువివరాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహిన్ ముజ్తబ, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఆర్ఐలు రవీందర్, శరత్, శ్రీనివాస్, సర్వేయర్ నరేష్, మల్లేష్, శారద, అనిత పాల్గొన్నారు.



జనగామ మండలం ఎల్లంలలో సదస్సును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

కొనసాగుతున్న భూ భారతి సదస్సులు

జఫర్‌గడ్: మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. నాలుగవ రోజైన శుక్రవారం ఓబులాపూర్‌లో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ శంకరయ్య మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. రైతులు భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులపై క్షేత్ర స్థాయి పరిశీలన జరుగుతుందన్నారు. కాగా, శుక్రవారం నాటి సదస్సులో 33 మంది రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. సదస్సులో ఎంఆర్ఐలు బలరాం, దేవేందర్, సీనియర్,జూనియర్ అసిస్టెంట్లు కృపాకర్‌రెడ్డి, రమ్య, శివ, గాంధీ, సాజీద, సరోజ, రాజ్‌కుమార్‌పాల్గొన్నారు.

సంక్షేమ పాలనే మోదీ ధ్యేయం : బీజేపీ

జఫర్‌గడ్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పాలనతో పాటు ప్రజా రక్షణే ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముందుకుసాగుతోందని బీజేపీఅనుబంధ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు సోమిడి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ 11ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం జఫర్‌గడ్‌లో బీజేపీ, అనుబంధ సంఘాల శ్రేణులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మోదీ పాలనలో పేదలు, బడుగు వర్గాలు, రైతుల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో పాటు దేశ రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టారన్నారు. సమావేశంలో బీజేపీమండల అధ్యక్షుడు నాగేశ్‌గౌడ్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండి.వలీపాషా, పార్టీ, అనుబంధ సంఘాల జిల్లా, మండల నేతలు సురేశ్‌గౌడ్, రామరాజు, సింగారపు రమేశ్, గోదారి సాయిరాం, పి.రాజు, లింగంయాదవ్, కవిత, పవన్ యాదవ్, చీకటి శ్రీనివాస్ గౌడ్, శ్వేత, సిహెచ్.శ్రీను, అశ్విని, తిరుపతి, చంద్రమౌళి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న మోదీ

బచ్చన్నపేట: ప్రపంచం గర్వించేలా దేశాన్ని అభివృద్ధి పథంలో ప్రధాని నరేంద్రమోదీ నడుపుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంకుగారి శశిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో బంగారు మహేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. 11 ఏళ్ల సుపరిపాలన దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిందన్నారు. కేంద్రం తెలంగాణకు 10 లక్షల కోట్ల నిధులిచ్చి అభివృద్ధికి సహకరించిందన్నారు. తెలంగాణలో బీజేపీకి మంచి రోజులు ఉన్నాయని తెలిపారు. అనంతరం మండల అధ్యక్షుడిగా నియామకమైనన బంగారు మహేశ్‌ను సన్మానించారు. నాయకులు చక్రపాణి, గద రాజు, దొంతుల చంద్రమౌళి, వెంకట్‌రెడ్డి, కక్కెర్ల గణేశ్, శ్రీకాంత్ రెడ్డి, సీతారాములు, వెంకట్, సురేశ్, రాంబాబుపాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి



పాలకుర్తిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు శ్రీమాన్

పాలకుర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల స్థాయి సమావేశం జరుగగా ముఖ్య అతిథిగా శ్రీమాన్ హాజరై మాట్లాడారు. ప్రపంచంలో భారతదేశం ఆర్థికంగా నాలుగో స్థాయికి చేరిందన్నారు. దేశ ప్రజల సంక్షేమమే కాకుండా దేశ భద్రతకు సంబంధించి ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు చుక్కలు చూపించారన్నారు. సమావేశంలో మారం రవి, కడుదుల నిరంజన్‌రెడ్డి, దుంపల సంపత్, వేల్పుల దేవరాజ్, కె.యాదగిరి, పట్టణ అధ్యక్షుడు పి.సంతోష్ పాల్గొన్నారు.

కుల గణనకు కేంద్రం ఆమోదం హర్షనీయం

రఘునాథపల్లి: దేశంలో కుల గణనకు కేంద్ర ప్రభుత్వం అమోద ముద్ర వేయడం హర్షనీయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. పదకొండేళ్ల నరేంద్ర మోదీ పాలనలో అమృత కాలం-సంకల్పంతో సాకారం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో భారత్ బలమైన ఆర్థిక శక్తిగా అవతరించిందని అన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, సీనియర్ నాయకులు కల్వగూరి ప్రభాకర్, కావటి ముత్యాలు, వల్లాల ఉపేందర్, తిరుమల్ ప్రసాద్, ఉడుతరంజిత్, రామచంద్రం, చందర్ నాయక్ పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానించిన ప్రధానోపాధ్యాయుడు రమేష్

ముగిసిన సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం

పాలకుర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు ఉచితంగా నిర్వహించిన వేసవి సాఫ్ట్ బాల్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. శిక్షణ పొందిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లా యువజన క్రీడల అధికారి సహకారంతో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని సూచించారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ సందీప్‌ను అభినందించారు.

గ్రామదేవతలు సంస్కృతికి ప్రతిబింబాలు



నష్కల్‌లో బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న తాటికొండ రాజయ్య

చిలుపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామదేవతలు తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబాలు అని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని నష్కల్‌లో నిర్వహిస్తున్న బొడ్రాయి (గ్రామదేవత) ప్రతిష్ఠాపన వేడుకలకు శుక్రవారం హాజరయ్యారు. స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పాలనలో గ్రామదేవతల ఆలయాలకు పెద్దపీట వేశామన్నారు. ఊరూరా దుర్గామాత, రేణుకా ఎల్లమ్మ, భక్త మార్కండేయ ఆలయాలకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ఆరూరి స్వామి, చిర్ర రాజు, గ్రామస్థులు మోడెం భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

తాపీమేస్త్రీలకు ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన



పాలకుర్తిలో మోడల్ ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు, తాపీమేస్త్రీలు

పాలకుర్తి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై తాపీమేస్త్రీలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తాపీమేస్త్రీలకు అవగాహన సమావేశం నిర్వహించిన అనంతరం రైతు వేదిక సమీపంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇంటిని మేస్త్రీలతో కలిసి అధికారులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాములు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు సూచించినట్లుగా 400 నుంచి 600స్క్వేర్ ఫీట్లకు మించకుండా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని అన్నారు. 400 స్క్వేర్ ఫీట్లకు తగ్గకుండా ఇళ్ల నిర్మాణం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ చంద్రశేఖర్, ఏఈ రోహిత్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయాల్లో వైద్య శిబిరం



జనగామ శిబిరంలో వైద్యులు, మునిసిపల్ సిబ్బంది డీఎంహెచ్‌వో, కమిషనర్

జనగామ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జనగామ మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో పారిశుధ్య కార్మికులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు, మునిసిపల్ సిబ్బందికి గైనకాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ, జనరల్ ఫిజీషియన్ విభాగాలకు చెందిన స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు నిర్వహించారు. తెలంగాణ డయాగ్నస్టిక్ ద్వారా రక్త, మూత్ర నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. రిపోర్టుల అనంతరం అవసరమైన వారికి వైద్యం అందిస్తామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మునిసిపల్ సిబ్బంది దుమ్ము, ధూళిలో నిత్యం పని చేస్తుంటారని, దీని వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ క్రమంలోనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

- స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : జిల్లా అధికారుల ఆదేశం మేరకు శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ మునిసిపాలిటీ ఆఫీసు వద్ద సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం డిప్యూటీ డీఎంహెచ్ఎం డాక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో వ్యాధుల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. మునిసిపాలిటీ పరిధిలోని ఘన్‌పూర్, చాగల్లు, శివునిపల్లిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి షుగర్, బీపీ, క్యాన్సర్ తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. మొత్తం 103 మంది సిబ్బంది, 56 మంది ఇతరులకు పరీక్షలు చేసిన వైద్యులు వారిలో 50 మందికి బీపీ, 70 మందికి షుగర్ లక్షణాలు ఉన్నాయని గుర్తించారు. నలుగురు మహిళలను పరీక్షించి ఒకరికి బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉండడం తో నిర్ధారణ కోసం జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యు లు స్నేహ, రజిత, రుబీనా, రాధిక, సీహెచ్‌వో చింత వెంకటస్వామి, స్వప్న, భవాని, ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బడిబాట ప్రారంభం



స్టేషన్‌ఘన్‌పూర్‌లో బడిబాట ర్యాలీ ప్రారంభిస్తున్న హెచ్ఎం సంపత్



తిడుగులో బడిబాట కరపత్రాల ఆవిష్కరణలో హెచ్ఎం, ఉపాధ్యాయులు



కొడకండ్లలో బడిబాట ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు



మీదికొండలో కరపత్రాలను అవిష్కరిస్తున్న టీచర్లు, నాయకులు

- గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించిన ఉపాధ్యాయులు
- ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి
- సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరించిన టీచర్లు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే బడిబాటను విజయవంతం చేయాలని పలు పాఠశాలల హెచ్ఎంలు కోరారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ పీఎస్, హైస్కూల్, ఇందిరానగర్ పీఎస్, శివునిపల్లి హైస్కూల్, పీఎస్, యూపీఎస్‌లలో బడిబాట గ్రామ సభలు నిర్వహించారు. శివునిపల్లి హైస్కూల్‌లో బడిబాట ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు మాట్లాడారు. 19వ తేదీ వరకు నిర్వహించే బడిబాటలో బడిఈడు పిల్లలను, డ్రాపౌట్లను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. గ్రామ ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. సమావేశాల్లో జీహెచ్ఎంలు ఎం.సంపత్, కె.రమేశ్, పీఎస్ హెచ్ఎంలు రఘుప్రసాద్, చిక్కుడు శ్రీనివాస్, పి.శ్రీధర్, రియాజుద్దీన్, జానకి, కె.ప్రవీణ్‌కుమార్, వార్డెన్ అనిత, సీఆర్‌పీ వెంకటేశ్వర్లు, లవన్, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్‌లు, వీవోలు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో స్థానిక హైస్కూల్ టెన్త్ విద్యార్థులు కె.అక్షర, కృప, బి.శివాంజలిలకు మహాలక్ష్మి ఎలాప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందించారు.

- స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని మీదికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం శోభారాణి తెలిపారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఫలితాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం కుమారస్వామి, పంచాయతీ సెక్రటరీ అశోక్, నాయకులు నాగరబోయిన శ్రీరాములు, నాగరబోయిన యాదగిరి, ఉపాధ్యాయుడు గజ్జెల రాజు, అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, రమ, మంగ, నాయకులు కాసాని శ్రీకాంత్, జోగు కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- జఫర్‌గడ్: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కోసం గ్రామాల్లో సమావేశాలు చేపట్టారు. తిడుగులో జరిగిన సమావేశంలో పాఠశాల హెచ్ఎం సదానందం మాట్లాడుతూ బడిఈడు పిల్లలను చదువు కోసం ప్రైవేటు విద్యాలయాలకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ, గ్రామ పంచాయతీ, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.
- కొడకండ్ల: మండలంలో శుక్రవారం బడిబాట ప్రారంభమైంది. మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కొడకండ్ల ప్రత్యేకాధికారి రవీందర్, తహసీల్దార్ చంద్రమోహన్, ఎంపీవో ఇందిర, కార్యదర్శి మహేష్‌లు బడిబాట కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు, అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన ఉచిత విద్య లభిస్తుందని తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం బడిబాటర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దోర్నం ప్రభాకర్, ఉపాధ్యాయులు గడ్డం చంద్రమౌళి, ఉమేష్, అంగన్‌వాడీ టీచర్ ఉప్పల సరిత, కాంగ్రెస్ నాయకులు డి.భిక్షపతి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.
- బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల పరిధిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని, ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తుండటంతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉంటున్నాయన్నారు. ఆలీంపూర్‌లో ప్రభుత్వ పాఠశాలలకు అండగా నిలుస్తున్న ఎన్ఆర్ఐ శ్రీకాంత్‌రెడ్డిని సన్మానించారు. గంగాపూర్‌లో హెచ్ఎం బండి లావణ్య, కొడవటూరులో హెచ్ఎం అరుంధతి, గ్రామాల్లో కార్యదర్శులు, హెచ్ఎంలఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

చిలుపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లగుట్ట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న సాదం అశ్విత, నిహారిక, లాస్య, చిత్ర, కార్తీక్, సుశాంత్, వైశాలి, జీడి ప్రీతి అర్హత సాధించడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజుగౌడ్, మార్కెట్, దేవస్థానం డైరెక్టర్లు రత్నాకర్‌రెడ్డి, పేరాల సుధాకర్ తదితరులు అభినందించారు.

తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి హఠాన్మరణం

- భూ భారతి సదస్సుకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటు
- ఆస్పత్రికి తరలించేలోపే కన్నుమూత



శ్రీపాల్‌రెడ్డి (ఫైల్)

రాంనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ తహసీల్దార్ కర్ర శ్రీపాల్‌రెడ్డి(46) గుండెపోటుతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. కుటుంబసభ్యులు, ఉద్యోగులు తెలిపిన ప్రకారం... హనుమకొండలోని 'కుడా' కాలనీలో నివాసం ఉండే శ్రీపాల్‌రెడ్డి ఉదయం నిద్రలేచిన అనంతరం భూ భారతి సదస్సుకు వెళ్లాలని బ్రేక్‌ఫాస్ట్ సిద్ధం చేయమని కుటుంబ సభ్యులకు చెప్పాడు. అయితే అంతలోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే కుటుంబసభ్యులు సమీపంలో ఉండే వైద్యుడిని ఆశ్రయించి సీపీఆర్ చేసి సుబేదారిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీపాల్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలోకి వచ్చిన శ్రీపాల్‌రెడ్డి.. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఆర్ఐ, డీటీగా విధులు నిర్వర్తించి తహసీల్దార్‌గా పదోన్నతిపై ఆదిలాబాద్‌కు వెళ్లారు. ఎన్నికల సమయంలో హనుమకొండ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టి విధుల్లో కొనసాగుతున్నారు. శ్రీపాల్‌రెడ్డి మరణం విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు, రెవెన్యూ ఉద్యోగులు, హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది వచ్చి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం వాజ్‌పేయి కాలనీలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

పదేళ్లలో పేదలకు ఇళ్లు ఇవ్వని రాజయ్య : కాంగ్రెస్

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన రాజయ్య తన పాలనలో నిరుపేదలకు ఇళ్లు అందించని అసమర్థుడని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే పేదలకు ఇళ్లు రాలేదన్నారు. ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా పనిచేసిన రాజయ్య కొత్తపల్లి గ్రామంలో అర్హులైన ఐదుగురు నిరుపేదలకు ఇళ్లు ఇవ్వలేదని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆ ఐదుగురు పేదలు కాదా.. అని ప్రశ్నించారు. రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 30 ఇళ్లు అందించారని, ఆ సమయంలో ఐదుగురు మీకు కనబడలేదా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామంలో 40 మంది నిరుపేదలను గుర్తించినప్పటికి మొదటి విడతగా 25 మందికే ఇళ్లు మంజూరి అయ్యాయని. మిగితా వారికి రెండవ విడతలో అందిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరిగిందని, రూపాయి ఖర్చు కాకుండా లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చిన ఘనత కడియందే అన్నారు. రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రతీ పథకంలో కమీషన్లు తీసుకున్నారన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు నాగరబోయిన శ్రీరాములు, గడ్డమీది సురేష్, మంద రాజు, చింత ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య, పోగుల సారంగపాణి, నీల శ్రీధర్, తోట సత్యం, వెంకటయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి